క్లుప్తంగా

నేడు ఆసరా చెక్కు పంపిణీ

పూతలపట్టు: మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గౌరి ఓ ప్రకటనలో తెలియజేశారు. శుక్రవారం ఉదయం నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ముఖ్య అతిథిగా హాజరుకానునట్లు తెలిపారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, డ్వాక్రా మహిళలు హాజరు కావాలని కోరారు.

బంగారు పాళెంలో..

బంగారుపాళెం: మండలంలోని డ్వాక్రా సంఘ సభ్యలకు శుక్రవారం వైఎస్సార్ ఆసరా నిధులు పంపిణీ చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి గురువారం తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మధ్యాహ్నం ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మహిళా సంఘ సభ్యులకు వైఎస్సార్ ఆసరా చెక్కును అందజేయనున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిపారు.

వీరాంజనేయస్వామికి సారె



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం పొన్నియమ్మగుడివీధిలోని శ్రీవీరాంజనేయస్వామికి గురువారం రాత్రి ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి సారె, పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు సుధాకర్ గురుకుల్ పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందించారు. ప్రసాదం అందజేశారు.

సమాజ సేవతో వ్యక్తిత్వ వికాసం



మాట్లాడుతున్న డాక్టర్ కమలాకర్‌రెడ్డి

కార్వేటినగరం: సమాజసేవ ద్వారా వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని ప్రముఖ హోమియోపతి వైద్యులు డాక్టర్ కమలాకర్‌రెడ్డి అన్నారు. గురువారం సుద్దగుంట గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ క్యాంపు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్పెషల్ క్యాంపుల ద్వారా సమయ పాలన, కార్యనిర్వహణ పద్ధతులు, సేవ ద్వారా నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, జీవిత నైపుణ్యాలను నేర్చుకోవాలని వివరించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలో చేపట్టిన సేవలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ధనంజయరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ వెంకటేశన్, డాక్టర్ చంద్రశేఖర్, శివాలయం ఆలయ అధ్యక్షుడు మోహన్‌రాజు, వలంటీర్లు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీ: ఇద్దరికి గాయాలు

తవణంపల్లె: మండలంలోని దిగువమోదలపల్లె వద్ద ట్రాక్టర్ ఢీకొని ఇద్దరు యువకులకు గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రసాద్ కథనం మేరకు.. తవణంపల్లె మండలంలోని కొత్తగొల్లపల్లెకు చెందిన ఇ.శంకరయ్య కుమారుడు ఇ.తరుణ్‌యాదవ్(21), మురగయ్య కుమారుడు దేవేంద్ర(29) మోటారు సైకిల్‌పై తవణంపల్లెకు వెళ్లి, తిరిగి ఇంటికి వెళుతుండగా దిగువ మోదలపల్లెకు చెందిన బాబునాయుడు కుమారుడు సోము ట్రాక్టర్‌ను వేగంగా నడుపుతూ ఎదురుగా వచ్చి ఢీకొన్నాడు. దీంతో తరుణ్‌యాదవ్, దేవేంద్ర గాయపడ్డారు. తరుణ్ పరిస్థితి విషమించడంతో తిరుపతి రమాదేవి హాస్పిటల్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తులు

రొంపిచెర్ల: రొంపిచెర్ల కస్తూర్బా గురుకుల పాఠశాలలో 2023–24 సంవత్సరం ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ప్రత్యేక అధికారి సుజాత తెలిపారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ సీఈసీ గ్రూపులో 40 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. 7, 8, 9 తరగతుల్లో నాలుగు సీట్లు మాత్రమే ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఏప్రిల్ 20వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బాలికలు మాత్రమే అర్హులని తెలిపారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

కేవీబీపురం: మండలంలోని పెరిందేశం గ్రామంలో ఏటా నిర్వహించే జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు గురువారం ఎంపీపీ మునిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుడు చెంచుకృష్ణ నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు నింద్ర, కళత్తూరు, శ్రీకాళహస్తి, వరదయ్యపాళెం జట్లు తలపడ్డాయి. అందులో వరదయ్యపాళెం, కళత్తూరు జట్లు ప్రతిభ చాటి మొదటిరౌండ్‌లో విజేతలుగా నిలిచాయి. విజేత జట్లకు వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుడు చెంచుకృష్ణనాయుడు రూ.10,000 నగదు బహుమతి, మరో రూ.10 వేలు విలువ చేసే ఆరు వాలీబాల్స్, నాలుగు నెట్లను విరాళంగా అందించారు.

చిత్తూరు: ప్రత్యేక అలంకరణలో కోదండరామస్వామి



బంగారుపాళెం: విశేషాలంకారంలో సీతారామస్వామి



గుడిపాల: బొమ్మసముద్రంలో విశేషాలంకరణలో సీతారాములు



సీతారాముల కల్యాణ వైభవం

- ఊరూవాడా నవమి వేడుకలు
- ఆలయాల్లో విశేష పూజలు



యాదమరి: కాణిపాకం పురవీధుల్లో ఊరేగుతున్న సీతా రామచంద్ర స్వామి

చిత్తూరు రూరల్: శ్రీరామ నవమి వేడుకలు ఊరూవాడా ఘనంగా సాగాయి. రామాలయాలన్నీ రామ నామంతో పులకించిపోయాయి. మండుతున్న ఎండలను సైతం లెక్క చేయకుండా తరలివచ్చిన భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. నగరాలు, పట్టణాలు, పల్లెసీమలన్నీ ఊరూరా వెలసిన శ్రీరామ మందిరాల్లో నవమి వేడుకలు సంప్రదాయ బద్ధంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పలుచోట్ల సీతారాముల కల్యాణం వైభవంగా సాగింది. మండు వేసవిలో ఆరోగ్యప్రదాయనిగా భావించే బెల్లపు పానకం, వడపప్పు వంటి తీర్థ ప్రసాదాలు భక్తులకు పంపిణీ చేశారు.

ఆలయాలకు ప్రత్యేక శోభ

చిత్తూరు నగరంలో శ్రీరామ నవమి పండుగను వైభవంగా నిర్వహించారు. ఆలయాలను వివిధ రకాల పుష్పాలతో, విద్యుత్ దీపాలతో ఆలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించాయి. ఆలయాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. అనంతరం హోమాలు, అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సీతారాముల కల్యాణోత్సవాన్ని తిలకించి తరించారు.

నగరంలోని కోదండ రామస్వామి ఆలయంలో వేకువజాము నుంచే భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి భారీ సంఖ్యలో క్యూకట్టారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామిని నగరవీధుల్లో ఊరేగించారు. గిరింపేట వీరాంజనేయ స్వామి ఆలయంలో ఉదయం సుగంధ ద్రవ్యాలతో స్వామిని అభిషేకించారు. తమలపాకులు, ప్రత్యేక పూలతో అలంకరించారు. సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పొన్నియమ్మ గుడి వీధిలోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో కూడా నవమి పూజలు వేడుకగా సాగాయి.

అభయాంజనేయ స్వామి ఆలయంలో..

పోలీస్ టాప్‌లైన్ శ్రీ సీతారామలక్ష్మణ సమేత అభయాంజనేయ స్వామిదేవస్థానంలో ఉభయదారులు స్వామి వారికి వస్త్రాలు, పూజ సామగ్రి సమర్పించారు. ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదానం చేశారు. వేద పండితులు స్వామి వారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా చేసి, భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. స్థానిక మిట్టూరులోని కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవ పూజలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

సాయి బాబా ఆలయంలో...

షిరిడీ సాయి ట్రస్టు నిర్వాహకురాలు సికె లావణ్య ఆధ్వర్యంలో స్థానిక కట్టమంచిలో వెలసిన సాయి బాబా మందిరంలో పాలాభిషేకము, శ్రీరామ అర్చనలు, చందనోత్సవము, కాగడ హారతి, మధ్యాహ్న హారతి, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో బాబాను పుష్పపల్లకిలో ఊరేగింపు చేశారు.

మొగిలివెంకటగిరిలో...

బంగారుపాళెం: మండలంలోని మొగిలి వెంకటగిరి శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో ఉదయం రామాలయంలో శ్రీసీతారామ సమేత లక్ష్మణస్వామి, ఆంజనేయస్వామి మూల విగ్రహాలకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి ట్రాక్టర్‌పై కొలువుదీర్చి గ్రామ పురవీధుల్లో మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. మండలంలోని రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. ఆలయాలలో పానకాలు, వడపప్పు ప్రసాదంగా పంపిణీ చేయారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు తులసీరామ కృష్ణారెడ్డి, శిరీష్‌రెడ్డి, సర్పంచ్ దీప్తిరెడ్డి, ఆలయ చైర్మన్ ప్రకాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో అన్నదానం

గుడిపాల: మండలంలో పల్లూరు, బసవాపల్లె, 197రామాపురం, బొమ్మసముద్రం, నంగమంగళం, చిత్తపార, చీలాపల్లె, కోలావూరు గ్రామాల్లోని రామాలయాల్లో రాములోరి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో సాయంత్రం దేవాలయాల వద్ద భజనలు చేశారు. నారగల్లు గ్రామంలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతోపాటు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, జనార్దన్, శింభు, వెంకటేష్‌రెడ్డి, సాముమేలు పాల్గొన్నారు.

ప్రత్యేక అభిషేకాలు

యాదమరి: మండల కేంద్రంలో వెలసిన శ్రీ సీతారాముల ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు వేడుకగా నిర్వహించారు. నవమి సందర్భంగా ఆలయంలో మూలవిరాట్‌లో వెలసిన సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, దర్శనం కల్పించారు. అనంతరం సాయంత్రం సీతారాములను పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలా అలంకరించి కల్యాణ వేదికలో కొలువు తీర్చారు. ఆలయ అర్చకులు శ్యామసుందర ఆచార్యులు, హేమంత్ ఆచార్యులు వేదమంత్రాల మధ్య స్వామివారికి వేడుకగా కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామి వారి కల్యాణం తిలకించడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

నవమి వేడుకల్లో ఎమ్మెల్యే దంపతులు



నగరంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, గిరింపేటలోని శ్రీ వీరాంజనేయస్వామికి కుటుంబ సమేతంగా పట్టువస్త్రాలు సమర్పించి కల్యాణోత్సవాన్ని తిలకించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, ఎమ్మెల్యే సతీమణి, సత్యవతి, ఆలయ నిర్వాహకులు సకల వెంకటేష్ గుప్తా, రాజా, మాధవి పాల్గొన్నారు.



గుడిపాల: పల్లూరులో సీతారాముల కల్యాణోత్సవం



చిత్తూరు: కోదండరామస్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు



బంగారుపాళెం: సీతారామస్వామి ఉత్సవ మూర్తుల గ్రామోత్సవం



యాదమరి: స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

అర్ధగిరి వీరాంజనేయ స్వామి దేవస్థానంలో..

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం మూలవిరాట్ శ్రీ వీరాంజనేయ స్వామికి అభిషేకం చేయించారు. తర్వాత ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం ఆలయంలోని మండపంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని సంప్రదాయ పద్ధతులతో ఘనంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామి వారి కల్యాణోత్సవాన్ని తిలకించి పునీతులయ్యారు. శ్రీ రామనవమి సందర్భంగా ఆలయంలో పుష్పాలతో ప్రత్యేక అలంకరణతో సుందరంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి, ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై కోదండరాముడి విహారం





టి.పుత్తూరులో అశేష భక్తజనం మధ్య సీతారాముల కల్యాణోత్సవం, అర్ధగిరిలో సీతారాముల కల్యాణం చేయిస్తున్న అర్చకులు

తవణంపల్లె: కోదండరామ స్వామి దేవస్థానంలో గురువారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం ఆలయంలో సీతారామలక్ష్మణులుగా భావించే మూడు కొబ్బరి చెట్లకు పూజలు చేశారు. సాయంత్రం సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం నుంచి అర్చకులు, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి, ఈఓ వెంకటసుబ్బారెడ్డి, కాణిపాకం దేవస్థానం తరఫున స్వామి వారి పట్టువస్త్రాలను పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు , కాణిపాకం ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ మోహన్ రెడ్డి, ఆలయ ఈఓ వెంకటేష్, సిబ్బందితో కలసి స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. వీరికి ట్రస్టుబోర్డు ఆధ్వర్యంలో గ్రామస్తులు సాదర స్వాగతం పలికి స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, అర్చకులు గురువారం రాత్రి సమర్పించారు. భక్తు లకు అన్నదానం చేశారు. ఆలయంలో రామకోటి భజనలు చేయించారు. రాత్రి గరుడ వాహన సేవను వైభవంగా నిర్వహించారు. గాండ్ల కులస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు.

టి.పుత్తూరులో..

టి.పుత్తూరు కోదండరామాలయంలో సీతారామలక్ష్మణులకు భక్తిప్రపత్తులతో అభిషేకం, పూజలు నిర్వహించారు. సాయంత్రం సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్ధేశ్వర రెడ్డి, కార్య నిర్వాహకులు శంకర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, గ్రామస్థుల ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు.

హనుమంతుడిపై సీతారాములు



కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి అనుబంధంగా ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో నవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రాత్రి నూతన వధూవరులను పుర వీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చి హనుమంతు వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర మంగళ హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

మంత్రి అంబటికి ఎమ్మెల్యే తేనీటివిందు



మంత్రి అంబటి దంపతులతో ఎమ్మెల్యే దంపతులు

చిత్తూరు కార్పొరేషన్: జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు చిత్తూరులోని ఎమ్మెల్యే నివాసానికి వచ్చి తేనీటి విందును స్వీకరించారు. పార్టీ నాయకులు మంత్రిని సన్మానించారు. కార్యక్రమంలో మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, టౌన్‌బ్యాంకు చైర్మన్ రాంగణేష్, కార్పొరేటర్ జ్ఞానజగదీష్, పూర్ణ, కో–ఆప్షన్ సభ్యులు కిరణ్, సర్పంచ్ రజనీకాంత్, నాయకులు కృష్ణారెడ్డి, వినాయక బాలాజీ, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ‘సంకెళ్లను తెంచుకుంటూ’

తిరుపతి కల్చరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ చీఫ్ సెక్రటరీ కాకి మాధవరావు ఆత్మకథగా వెలువడిన సంకెళ్లను తెంచుకుంటూ పుస్తకాన్ని శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఎస్వీయూ సెనేట్ హాల్లో ఆవిష్కరించనున్నట్లు విశ్రాంత జిల్లా జడ్జి పి.గురప్ప, ఐఏఎస్, ఐపీఎస్ గ్రూప్ ఫోరం కన్వీనర్ సిద్ధోజీరావు తెలిపారు. వారు గురువారం ప్రెస్‌క్లబ్‌లో పుస్తకావిష్కరణ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కాకి మాధవరావు ఐఏఎస్ అధికారిగా సుదీర్ఘ కాలం సేవలు అందించారని తెలిపారు. హైదరాబాద్‌లో స్థాపించిన ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, కేబీఆర్ పార్క్, ఏపీ స్టడీ సర్కిల్, రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటులో ఆయన కృషి చాలా ఉందని తెలిపారు. సంకెళ్లను తెంచుకుంటూ పుస్తకంలో తను పాలేరు నుంచి చీఫ్ సెక్రటరీగా ఎలా ఎదిగారో కాకి మాధవరావు వివరించారని తెలిపారు. ఈ పుస్తకం నేటి విద్యార్థులకు, భావితరాల వారి లక్ష్య సాధనకు దిక్సూచిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

అంబేడ్కర్ మనవడి రాక

ఎస్వీయూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.రాజారెడ్డి అధ్యక్షతన జరిగే ఈ పుస్తక ఆవిష్కరణ సభకు ముఖ్య అతిథిగా అంబేడ్కర్ మనవడు ప్రకాష్ అంబేడ్కర్ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నేతలు, బహుజనులందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. సమావేశంలో అంబేడ్కర్ ఆర్మీ నేత డాక్టర్ గోపి, టీటీడీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నేతలు ఎం.ప్రసాద్‌రావు, జె.భాస్కర్, గాలి సుధాకర్, బ్లూవింగ్స్ ఫౌండేషన్ ప్రతినిధి గిరి, సురేష్, రమేష్‌బాబు క్రిష్ణమూర్తి, బి.శ్రీనివాసులు, సీనియర్ జర్నలిస్టు నాగరాజు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రిటైర్డ్ జిల్లా జడ్జి గురప్ప, సిద్ధోజీరావు

సేవలు మరింత చేరువగా..



వసంతాపురంలో సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

గుడిపాల: గ్రామ, వార్డు వలంటీర్లు వారి పరిధి(క్లస్టర్)లోని ఇళ్లకు వెళ్తూ ప్రభుత్వ సేవలు అందిస్తున్నారు. వలంటీర్ల వ్యవస్థ పనితీరును తెలుసుకోవడంతోపాటు ప్రజలకు సేవలు మరింత చేరువ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ప్రతి గడపకూ వెళ్తున్నారు. వలంటీర్ల పనితీరు ఎలా ఉంది? ప్రభుత్వ పథకాలతో లబ్ధిపొందారా? సచివాలయం నుంచి పొందుతున్న సేవలు, ఇంకా ఎలాంటి సేవలు కావాలి? అని కుటుంబ యజమానిని అడిగి తెలుసుకుంటున్నారు. ప్రజల నుంచి వచ్చే స్పందనను ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన సిటిజన్ ఔట్‌రీచ్ బెనిఫిషియరీ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ఈ సర్వే ఇప్పటికే ప్రారంభమైంది. ప్రతి నెలా చివరి శుక్ర, శనివారాలు రెండు రోజులపాటు సర్వే నిర్వహిస్తున్నారు.

యాప్ డౌన్‌లోడ్ ఇలా..

వలంటీర్ల వద్ద ఉన్న మొబైళ్లలో ఈ సిటిజన్ ఔట్‌రీచ్ బెనిఫిషియరీ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. యాప్‌లో లాగిన్ కాగానే సచివాలయ ఉద్యోగి ఆధార్ నెంబర్ లేదా ఫోన్ నంబర్ ఎంటర్ చేయాలి. ఆ తరువాత బయోమెట్రిక్ లేదా ఓటీపీ ద్వారా లాగిన్ కావచ్చు. వలంటీర్ కాకుండా సచివాలయ ఉద్యోగి ఆధార్‌నెంబర్ నమోదు చేస్తేనే యాప్ ఓపెన్ అవుతుంది. ఇక్కడ సచివాలయ పరిధిలోని వలంటీర్, క్లస్టర్‌ల వివరాలు డిస్‌ప్లే అవుతాయి. ఇందులో ఒక క్లస్టర్‌ను సెలక్ట్ చేయగానే అందులోని కుటుంబాలు, ఐడీ నెంబర్లు, కుటుంబసభ్యుల వివరాలు కనిపిస్తాయి.

ప్రశ్నావళి ఇలా...

ఒక్కో ప్రశ్న అడుగుతూ సమాధానం అప్‌లోడ్ చేయాలి. ప్రధానంగా ఏడు ప్రశ్నలుంటాయి. మీ గ్రామ, వార్డు సచివాలయం ఎక్కడుందో తెలుసా?, మీ గ్రామ, వార్డు వలంటీర్ మీకు తెలుసా?, మీ వలంటీర్ ఎన్ని రోజులకోసారి మీ ఇంటిని సందర్శిస్తున్నారు.?, మీకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పతకాలు తెలుసా? (కుటుంబ సభ్యుడికి సంక్షేమ పథకాల వివరాలు చదివి వివరిస్తారు). సచివాలయం అందిస్తున్న సేవలు తెలుసా?, సేవలకు సంబంధించి మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా?, ఆధార్ నెంబర్‌ను బ్యాంక్ అకౌంట్‌తో లింక్ చేయాలని మీకు తెలుసా?, అని అడుగుతారు. కుటుంబసభ్యులు చెప్పిన సమాధానాలు యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. చివరిగా లబ్ధిదారుడి ఫొటో తీసుకొని సబ్‌మిట్ చేస్తే డేటా మొత్తం యాప్‌లో నిక్షిప్తమై ఉంటుంది. కరెంట్, భూమి, వాహనాలు, ఉద్యోగం, వ్యాపారం, విద్యార్హత, పాన్‌కార్డు ఉందా ? అనికూడా తెలుసుకొని యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నారు.

ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నాం



మేమే ప్రతి ఇంటికీ వెళ్లి సిటిజన్ ఔట్‌రీచ్ బెనిఫిషియరీ యాప్ సర్వే చేస్తున్నాం. వలంటీర్ల పనితీరుతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా లబ్ధిపొందారా? ఇంకా ఎలాంటి సేవలు కావాలి అని అడుగుతున్నాం. వారి సమాధానాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. ప్రతి నెలా చివరి శుక్ర, శనివారం రెండు రోజుల పాటు ఈ సర్వే చేయాలని ఉత్తర్వులు అందాయి.

– అబ్దుల్లా, వెటర్నరీ అసిస్టెంట్, వసంతాపురం